చంద్ర
4
5
మైలురాళ్ళు

ఎగిరి ఒక్క తన్ను తన్నాడు. గబుక్కున వెనక్కు తిరిగి మళ్ళీ మూతి మాత్రం ముందుకు తిప్పి తుపుక్కున ఉమ్మాడు!

కోపమొస్తే మనిషి మనిషిని తన్నడం సహజం.... లేకుంటే—కారి ఉమ్మడమూ సహజం! పనిపాటల్లో మోరకేస్తే పశుప్రాయుడయిన మనిషి పశువును కూడా తన్నడం సహజం. లేదా కాండ్రించి ఉమ్మడమూ నైజం!

అయితే అతడు తన్నింది మనిషిని కాదు. కాండ్రించి ఉమ్మింది మనిషిమీద కాదు. పశువుమీద అసలే కాదు!

అల్లంత దవ్వులో నిలబడి ఆ దృశ్యాన్ని చూచి ఆశ్చర్యంలో పడి లేచేసరికి అతడు పరుగు నడకగా ఆ గనిమిల మింద పడి పోతున్నాడు. మరింత ఆశ్చర్యం వేసింది. అతని వెంట పడ్డాను. అతనిది నడక! నాది పరుగు!

పారిపోతున్న వాడిని పట్టుకోవడాని కన్నట్లుగానో, లేదు—వెంట బడి ఎవరో తరుముతున్నట్లుగానో వుంది—అతడి తత్తరపాటు గమనిస్తుంటే!

రాయలసీమలో రైతు చేతికింది పొలాలు ఒక్క ఎకరం ఏక చదరంగా వుండడమంటే ఎంతో అరుదు. మిట్ట పల్లాలు—ఎగుడు దిగుళ్ళు—ఏటవాలు తలాలు—ఎక్కడికక్కడికి ఎంతెంత మాత్రం చదర కట్టుగా వుంటే—అంతంత వరకు నాలుగు గనిమలు పోసి 'కయ్య' అని వ్యవహరిస్తారు. చాకలి ఉతికిన బట్టల్ని ఒక కోక పక్కన పంచను, పంచపక్కన తువాలును, తువాలు పక్కన దుప్పటిని ఆరవేసినట్లుంది, ఆ కయ్యల్ని చూస్తుంటే! కయ్య కయ్యకు మధ్య గనిమ వుంటుంది. అది ఉంటె మహా ఒక పట్టికాలు లావుంటుంది. ఆ గనిమ మీది నడక సర్కసులో కమ్మిమీద నడకలా వుంటుంది.

అతడు నడుస్తున్న వూపులో తడి గనిమలమింద కాళ్ళు తడబడుతున్నాయి. తడబడిన కాళ్ళు జారుతున్నాయి. కాలు జారేసరికి బోర్లగిల పడినట్టుపడి చేతులు మోపుమీద నిలదొక్కుకుంటున్నాడు. మళ్ళీ లేస్తున్నాడు. తిరిగి మళ్ళీ చూడకుండా ముందుకు సాగిపోతున్నాడు.

అతని కంటబడకుండానే నే నాతని వెంటపడ్డాను!

పరుగుదూరంలో ఒకబావి. ఆ బావి దగ్గర నిలబడ్డాడు. ఎడమకాలి చెప్పును కుడిచేతికి తీసుకొన్నాడు. నాలుగు దిక్కులు కలయచూశాడు.

మొల ఎత్తు జొన్నచేను చాటుగా నేను మాటువేశాను!

చెప్పుతో ఎంచి ఎడేట్లు కొట్టాడు!

పొంచి చూస్తున్న నేను ఆశ్చర్యంలోపడి కొట్టుమిట్టాడాను.

బలవంతుడు అనుకుంటే బలహీనుణ్ణి దయాదాక్షిణ్యాలు లేకుండా కొట్టగలడు చెప్పుతో! కొండెలో విషాన్ని నింపుకొన్న తేలు కంటపడితే చెప్పు చేతికి వస్తుంది. సాగర సమానమయిన సంసారాన్ని ఈది ఈది ఈసురోమని మిగిలిన మనిషి—ఓర్పు నశించిన స్థితిలో ఎవరినీ ఏమీ అనలేకుండా తన చెప్పుతో తన్నే కొట్టుకుంటాడు. ఎవరో ఒక అశ్వమేధ యాగ నిపుణుడు. పెళ్ళాం మెడలోని తాళితోసహా వోడిపోయాడట. అప్పటికి జ్ఞానోదయం కలిగినట్లుంది. చెప్పుతీసి చెడామడా కొట్టుకుంటున్నాడు.

'ఎందుకయ్యా?' అని అడిగితే 'నోరున్న మనిషిని. నోరులేని జంతువులపై ఆడి పోడిపోతినే! ఇంతకంటే ప్రాయశ్చిత్తమా?'' అని బోరోమని ఏడ్చాడట. బాగానే వుంది.

అయితే వీటన్నింటికీ విభిన్నంగా అతని చేతను గురించి ఆలోచిస్తూ ఒక పక్క కొరికినంతసేపు బుద్ధి వైదొలగింది. తెప్పరుకొని తేరపార చూసే సరికి కనుచూపును మించుతున్నాడు. పొలం గట్లమీద పడుతూ లేస్తూ పోతూనే వున్నాడు.

పొట్ట కర్రవేసిన నా ఆశ్చర్యం వెన్నుపోయింది.

నే నాతని వెంటపడ్డాను!

రెండు పరుగుల దూరంలో కానబావి. కన్నుమూసి తెరిచేలోపుగా అతడక్కడ నిలబడ్డాడు.

కానబావి ప్రక్కన్నే ఒక పెద్ద మట్టిగడ్డ. ఎప్పుడో కానబావి త్రవ్వినప్పుడు బావిలోని మట్టిని తీసి ఆ ప్రక్కనపోస్తే—అది కానబావి గడ్డగా నిలబడింది. ఆ గడ్డమీద కానుగచెట్టు. ఆ చెట్టు మాటులో నిలబడ్డాను. అయితే అతని వైపు ఒక కన్నువేసి వుంచాను.

అతడు గబుక్కున బోర్లగిల పడ్డంత పనిచేశాడు.

ఆ చీకట్లో నేను కన్నులు చించుకొని చూస్తూనే వున్నాను.

అతడు రెండు చేతులతో పొదివి పట్టుకొన్నాడు. గుండెలకు హత్తుకున్నాడు. తల వాలవేశాడు. వలవలా ఏడుస్తున్నాడు.

అతడు కౌగిలించుకుని వలవలా ఏడ్చింది అతనిని వీడి వెళ్ళిపోతున్న మనిషిని కాదు. ఆ చీకటిలో అతనికోసం ఎదురు చూస్తూ వుండిన ప్రియురాలినీ కాదు.

ఒక బావి దగ్గర ఎగిరి తన్నాడు. అక్కడికీ తృప్తిలేక కారి ఉమ్మాడు.

మరొక్క బావి దగ్గర ఎడమ కాలి చెప్పును కుడిచేతికి తీసుకుని ఎంచి ఏడేట్లు కొట్టాడు.

ఇంకొక బావి దగ్గర మనసార కౌగిలించుకుని వలవలా ఏడ్చాడు.

ఎవర్ని?

ఆ బావి గట్టుల మీద బిగించిన కరెంటు మోటారుల్ని!

ఇంతకూ ఇలా చేసిం దెవరు?

మాదిగ రాముడు.

ఎందుకు చేశాడు?

అదే అంతు దొరకలేదు.

నేను ఆలోచిస్తూనే వున్నాను. రాముడు మాత్రం పైకి లేచాడు. భుజం మీది తుండుగుడ్డతో కండ్లు వత్తుకున్నాడు. ఆ కరెంటు మోటారు వైపు జాలిగా చూశాడు. అటుపై గిరుక్కున వెనక్కు తిరిగాడు. గబగబ నడిచిపోతున్నాడు మాదిగిండ్ల వైపు!

ఇంటి వైపు వెడుతున్న రాముడిని వాడి ధోరణి అర్థంకాక కాసేపు మింటిపైపు చుక్కల్ని చూస్తూ నిలబడ్డాను.

చీకటి రక్కసి కురులు విరబోస్తే ఆమె తలలోని పువ్వులు చెదిరి అక్కడొకటి అక్కడొకటిగా ఆ వెంట్రుకలలో తగులుకున్నట్లు మినుక్కు మినుక్కు మంటున్నాయి మింటిమీది చుక్కలు! 'పరవ గుట్ట' సమీపంలో పొట్టినక్కల వూళలు ఉధృతంగా వినిపిస్తున్నాయి.

రకరకాల ఆలోచనలు బుర్రని తొలుస్తున్నాయి.

రాముడు!

నిడుపాటి చెవుల్లో నిగనిగలాడే ఎర్రాళ్ళ అంటుజోళ్ళు. దట్టమయిన కనుబొమల కింద వెడల్పాటి కండ్లు. ఆ కండ్లలో ఎప్పుడూ తొణికిసలాడే చిలిపితనము. గుబురు మీసాలు. ఆడవాళ్ళే అసూయపడేట్టుగా పిడికెట్లో ఇమడని పిగముడి. రాముడి ఆకారంలో ఏదో ప్రత్యేకత కొట్టవచ్చినట్లు కనిపించేది. వాడి నడకలో హుందాతనం అందాలు పోయేది. వాడిని చూస్తుంటే 'వీడెట్లా తక్కువ కులంలో పుట్టాడా?' అన్న సందేహం కలిగేది.

అలాంటి రాముడికి కొంపదీసి పిచ్చి పట్టలేదు గదా?

ఆ ప్రశాంత వాతారణంలో పైరుగాలి సయ్యాటలాడుతున్నా నా ఆలోచనలతో చిరుచెమటలు పోశాయి.

ఆ పాయకట్టులో ఒక పది పదిహేను గ్రామాలున్నాయి. ఆ గ్రామాల్లో ఒక నాలుగు గ్రామాల సేద్యం రాముడి మీద ఆధారపడి ఉండేది.

రాయలసీమలో నదీనదాలు లేవు. పెద్ద పెద్ద నదులకు కట్టిన ఆనకట్టల నుండి నీళ్ళు తరలించే ఆలోచన అసలేలేదు. అందువలన రాయలసీమ సేద్యం బావులమీద ఆధారపడి వుంటుంది.

తొలికోడి కూసే వేళకాడ మోటకట్టి నాలుగు బార్ల పొద్దెక్కేదాక 'రావన్న రావోఁ!' అని మోట తోలితేనే మడికి తడి పడుతుంది. మోటకు తోలుబాన అవసరం. ఆ తోలుబానను కుట్టి దాని జీవిత కాలమంతా 'రిపేర్' బాధ్యతల్ని వహించడానికి రాముడవసరం. అందుకే ఆ నాలుగు గ్రామాల కింద సేద్యానికి రాముడికి తీయాపెట్ట లేని సంబంధముంది.

"రాఁవుడు! తొండం అడ్డానిక సినిగిపోయిందిరా! మడికి తడిబడి రొండు నాళ్ళయ్యింది. ఈ పొద్దన్నా తడి పడుతుందనుకోని తొలి కోడి కూఁసే యాళకాడ లేస్తే రాళ్ళకాలవ కాడనే తెల్లారింది బతుకు. నీకు పున్నె వుంటుంది. లెయ్‌రా!" అని ఒక సన్నపాటి రైతు ఇంటిముందు నిలబడి బతిమాలుతూంటే—

"ఒరే! రాఁవుడూ! నిన్నగాక మొన్న కుట్టివి గదరా! నీ యమ్మా బడవా! తొండందారితొండానిది. బానదారి బానదయింది. లేచి రారా! ఈ పొద్దనంగానే తిరుగుడు కపిల కట్టి ఇద్దరు మణుసులు, రొండుకాండ్ల ఎద్దులు దండగైపాయ!" అని ఒక కలగినతడు ఎలుగెత్తి బావి దగ్గర నుండే అరుస్తూంటే—

"రాఁవన్నా! ఈ పొద్దు బాయిలో వంతు పొయ్యిందంటే మళ్ళీ మూన్నాళ్ళకు. ఇప్పటికే పైరు వరటకపోతా వుండాది. రొండు కుట్లట్ల

యేసిపో! నీకు దరమ్ముంటుంది" అని యింకొక్క రైతు అడుక్కుంటూంటే—

"ఇంతమంది ఇంటి సుట్టూ సేరి అరస్తావుంటే సెవల్లో సెట్లేవన్నా మొలిసినాయా! మొగోడి కింత పాలుమాలిక పనికిరాదు! పాలుమాలితివా? బయిసారితివా?' అంటారు పెద్దోళ్ళు. లెయ్! లెయ్యే!" అని రాముడి పెళ్లాం లచ్చిఁవి పోరుపెడుతూంటే—

"దినఁవూ సచ్చేవోడికి యేడ్చేవోళ్ళెవురాసే! సాలుగానుండు!" అని కసురుతూ లేచిపోతున్న లచ్చివిని ఒక చేత్తో పొదివిపట్టుకుని మలికోడి కూసే వేళకాడ నులక మంచం మీద వత్తిగిలి పడుకునే రాముడు—తొలి కోడి కూతకు ముందే ఇలా బావి బావి దగ్గర కరెంటు మోటర్లతో కలబడు తున్నాడంటే నా సందేహానికి సమాధానం దొరకలేదు.

అదే ఆలోచిస్తున్నాను!

అంతలోనే కానబావి పంపుసెట్టు దగ్గర కరెంటు దీపం వెలిగింది. అదిరిపడ్డాను. అసలు నేను వచ్చిన పని మరిచి దారిన పొయ్యే జగడం ఇంటి దాకా అన్నట్లుగా రాముడిని గురించి ఆలోచిస్తున్నాను.

ఎవరో ఎప్పుడో ఉద్యోగం పురుష లక్షణ మన్నారు. ఇప్పుడా మాటంటే పైటకొంగు చెరగు తీసి నడుముకు బిగించి 'ఏదీ! ఇంకొక్క సారి అనండి ఆ మాట చూద్దాం' అని సవాల్ చేస్తారు సోదరీమణులు. ఆ రోజుల్లో ఈ మాత్రం ఎదిరించేవాళ్ళు లేరు కాబట్టి ఈ పురుషుడికి ఉద్యోగ ప్రాప్తి జరిగింది. దాంతో పుట్టి పెరిగిన వూరు విడిచిపెట్టవలసి వచ్చింది.

ఊరుగాని వూళ్ళల్లో ఉద్యోగ బాధ్యతలు, పిల్లల చదువులు, ఆర్థిక ఇబ్బందులు. 'ఆ పల్లెటూళ్ళో పొద్దు పొమ్మన్నా పోదు' అన్న శ్రీమతిగారి ముద్దు ముద్దు మూతి విరుపులు ఏ మూడు నాలుగేళ్ళకో ఒకసారి కానీ మా వూరికి రావడానికి వలనుపడేది కాదు.

నేను వచ్చి నాలుగు రోజు లయింది.

"ఒరే అబ్బోడా! ఈ కరంటు రానన్నా వచ్చింది. కానీ దినవూ జాగారం(వయి పొయ్యిందిరా బతుకు. ఎప్పు డొస్తుందో? ఎప్పుడు పోతుందో? ఆ కరెంటు యిడిసిపెట్టే వోడికి కూడా తెలిసి యేద్చేటట్టుగా లేదు. ఈ పూటట్టమడికి తడేసి రారా!" అన్నాడు పాలుమాలిన మా అయ్య.

నిజమే! ఆ పల్లెల్లో కరెంటులేని దినాల్లో రైతు జీవితం నియమబద్ధంగా కొనసాగేది. ఎప్పుడు మోట కట్టితే ఎంత పారుదల జరుగుతుందో అతడికి తెలుసు. అందుకే అనుకున్న వేళకే లేచేవాడు. అంతవరకు అదమరిచి నిద్రపొయ్యేవాడు. అతడు నిద్రలేచేది తొలికోడి కూసే వేళకాడ కావచ్చు. మలికోడి కూతవేళ కావచ్చు. ఎండ చల్లబడినాక నాలుగుబార్ల పొద్దు కూడా కావచ్చు. కాని ఇప్పుడతనికి అయోమయస్థితి ఏర్పడింది. కంటికి వత్తి వేసుకుని రాత్రంతా జాగరణ చేయవలసిందే! లేకుంటే చేతికి వచ్చిన పైరు నోటికందదు.

నిజంగా సిగ్గు పడవలసిన విషయం. రైతు దేశానికి వెన్నెముక వంటివాడు. వాడు మేడి పట్టకపోతే దేశం 'ఆకలితో' అని అల్లాడిపోతుంది. అయితే పెద్ద పట్టణాల్లో పెద్ద పెద్ద మనుష్యులకు ఒంటిమీద చెమట పడుతుందని, పెద్ద పెద్ద మనుషులకు ఒంటిమీద చెమటలు పట్టడం దేశానికి క్షేమకరం కాదనీ తలపోసిన ప్రభుత్వం 'ఎర్ కండిషన్ల'ని ఎలెక్ట్రిక్ ఫ్యాన్లని ఎడతెరిపి లేకుండా పనిచేయిస్తూ ఉంది. రైతును మాత్రం చిన్న చూపు చూపింది.

ఆలోచించుకుంటూ మా బావి దగ్గిరికి చేరాను.

మీటనొక్కాను. పాతాళగంగ ఉరుకులు పరుగులమీద పంపు ద్వారా పైకి వచ్చి పడుతూ ఉంది. కాలువలో వయ్యారాలు పోతూ సాగిపోతూ ఉంది. తెల్లటి నురుగులు కక్కుతూ సన్నటి కాలువలో వయ్యారాలు పోతున్న జలకన్య — కోప మొచ్చిన నాగకన్యను తలపింప చేస్తూ ఉంది. మడవ అడ్డు తిప్పి మడికి నీళ్ళు పెట్టాను. ఆ కయ్య పారేదాక చేయవలసిన పనంటూ ఉండదు.

మళ్ళీ మాదిగ రాముడిమీద ముసురుకొంటున్నాయి ఆలోచనలు.

ఆ నాలుగు పల్లెల్లో ఒక వంద కడపకు పైగా ఉంటుంది. అందులో మూడుం ముప్పాతిక అంతో ఇంతో బావుల కింది సేద్యంతో బ్రదికేవాళ్ళే! వీళ్ళందరికీ రాముడు లేకుంటే దినగండం నూరేండ్లాయుస్సు!

మలికోడి కూసే వేళ కాడ మత్తుగా నిద్రలేస్తాడు రాముడు. గుక్కెడు నీళ్ళు నోట్లో పోసుకొని పుక్కిలించి ఉమ్మేస్తాడు. ముంతడు నీళ్ళతో మూతి తుడుచుకొంటాడు. సంచి భుజాన తగిలించుకొని బయలు దేరతాడు.

రాముడు ముందు పోతూంటే — కనీసం ఇద్దరు ముగ్గురు రైతులు వెంట పడవలసిందే!

ఆ నాలుగు పల్లెల కింద ఉన్న నలభై బావుల దగ్గరికి విధిగా వెళ్ళ తాడు రాముడు. ఒక బావి దగ్గర అడ్డానికి చినిగిన తొండానికి కుట్లువేస్తాడు. మరొక్క బావి దగ్గర చిల్లులు పడ్డ బానను సరిచేస్తాడు. ఇంకొక బావి దగ్గర తొండానికి 'ఉంగటాలు' తెగిపోతే కుట్టతాడు. అంతలో ఇంకొక్క బావి దగ్గర నుండి పిలుపు వస్తే వెళ్ళతాడు. మిట్ట మధ్యాహ్నం వరకు ఆ బావిదగ్గర నుండి ఈ బావిదగ్గరికి, ఈ బావి దగ్గరి నుండి ఆ బావి దగ్గరికి నిలిచిన చోట నిలువకుండా తిరుగుతూనే ఉంటాడు.

సద్ది వేళకు ఎక్కడో ఒక బావి దగ్గర ఎవరో ఒకరు ఆప్యాయంగా సద్ది పోస్తే తాగుతాడు. ఒక బావికింద మిరప తోటలో అన్ని మిరపకాయలు మరొక్క బావికింద వంగ తోటలో కాసిన్ని వంకాయలు—గీత చక్కనైన రాముడి చేతికందుతాయి. మూట భుజాన వ్రేలాడుతూంటే పొద్దు నడినెత్తి కెక్కేటప్పటికి ఇంటి ముఖం పడతాడు.

నాకు బాగా జ్ఞాపకముంది. అవి నా చిన్ననాటి రోజులు. చెప్పులు తొడుక్కొని నడవడమంటే ఏనుగు నెక్కినంత సంబరం. ఆ ముచ్చట కాస్త తీరాలంటే రాముడే శరణ్యం. కాళ్ళరిగేటట్లు ఎన్నిసార్లు తిరిగానో రాముడింటి చుట్టూ!

ఒకసారి వెళ్ళితే రెండు ముద్దలు బెల్లం తెమ్మనేవాడు. బెల్లానికిమంచి ధర పలికే వరకు సాధారణంగా అంతవరకు బెల్లాన్ని నిలువ చేస్తుంటారు. వెదురు బొట్టల్లో నింపి పైన దట్టంగా వరికసవు పరచి దానిపైన దిట్టంగా పేడతో అలుకుతారు. ఇక ఆ 'సీలు'ను విడతీయడం తరము కానిపని. కానీ ఇంటివాడుక కని కొంత బెల్లాన్ని కడవల్లో దాచి దొంతరలు పెడతారు. అమ్మ కంట బడకుండా ఆ బెల్లం ముద్దలు రాముడికి చేరవేయడం—అబ్బో! తలచుకొంటే గుండెలు జలదరిస్తాయి. బెల్లంముద్దల్ని ప్రీతిగా అందుకొన్న రాముడు 'రేపొచ్చెయ్?' అంటాడు. ఆ మరుసటి రోజు వెళ్ళితే—నా చెప్పులకు వాడబొయ్యే చర్మాన్ని దాని మన్నికను అనర్గళంగా వివరిస్తూ ఎట్లయినా ఒక వీసెడు ఎర్రగడ్డలు తెమ్మనేవాడు. అవి కూడా అందచేసి ఎంతో ఆశగా ఆ మరునాడు వెళ్ళితే—'అబ్బ తోడు సిన్నబ్బా! పులుసులో కంత చింతపండు లేదు. ఒక్క పదుగులో వచ్చెయ్! ఇక చూసుకో రేపొద్దున్నె నీ సెప్పులు నిగనిగలాడుతా ఉంటాయ్!" అనేవాడు.

నిజంగా జత చెప్పులు కోసం వాడు పెట్టిన తిప్పలు తలంపుకు వస్తే ఇప్పటికీ నాలో నేను నవ్వుకొంటుంటాను!

ఇక ఫలితకాలం వస్తే రాముడు వాడి పెళ్ళాం లచ్చిఁవి ఇద్దరు కళ్ళాల మీద పడేవాళ్ళు. కళ్ళాల్లేనిగుఱ్రాల్లా వయ్యారమే వగలు పడుతున్నట్లు ఏ కళ్ళం దగ్గర చూచినా వాళ్ళుగానే కనుపించేవాళ్ళు. రాముడు వృత్తికి బదులుగా ఫలితకాలంలో 'మేర' ఇస్తారు. ఆ 'మేర' వసూలు చిత్రంగా ఉంటుంది. దానికి కొలత లేదు. తూనిక అసలే ఉండదు. వాళ్ళు మొయ్య గలిగినంత మోసుకొని పోవచ్చు. నెత్తి మోతకుమించినట్లుగా వాళ్ళ నెత్తికెత్తి మొయ్యలేక వాళ్ళ నడ్డి నీలుగుతూంటే రైతులు ఆనందంలో పూగిపోయేవాళ్ళు!

రాముడి జీవితం ఆ పల్లీయుల జీవితాలతో ముడిపడి ఎంతో మచ్చటగా కొనసాగుతూ ఉండేది!

అలాంటి రాముడి ప్రవర్తన ఎంతో వింతగా తోచింది!

కరెంటు మోటారు 'గీ' పెడుతూనే ఉంది, గుక్క పట్టిన ఎలుగు బంటిలా! పాతాళగంగ పైకొచ్చి పడుతూనే ఉంది. ఒక కయ్య పారితే మరో కయ్యకు మడవ తిప్పి నీళ్ళు పారిస్తూనే ఉన్నాను. వీటితో కలిపి రాముడి మీది ఆలోచనలు కూడా సాగుతూనే ఉన్నాయి.

తూర్పున పటమెగురుతూ వుంది. ఊరి ముందర చింత చెట్లమీద కాకులు గోల చేస్తున్నాయి. కాన బావి కానుగచెట్టు మీద కొంగలు నిమ్మళంగా పైకెగురుతున్నాయి. పొలాల్లో అప్పటికే మడకలు కట్టిన రైతులు ఎద్దుల్ని అదిలిస్తున్న అరుపులు చెవిని పడుతున్నాయి. కడపటి కయ్యకు నీళ్ళు బెట్టి నీళ్ళు కలుసుకొన్నాయో లేదో? అని నాలుగు మూలలు చూడ డానికి గనిమల మింద నడుస్తున్నాను. 'టపీ!'మని ఆగిపోయింది కరెంటు. మరో పది నిముషాలు కరెంటు ఉండి ఉంటే కయ్య కలకలుసుకునేది. అదెప్పుడొస్తుందో! ఎప్పుడు పోతుందో తెల్దురా! అన్న మా అయ్య మాటలు నా కప్పుడు బాగా అర్థమయ్యాయి.

ఇంటికి వచ్చి అలా నడుం వాల్చానో లేదో రాత్రంతా నిద్రలేని కారణంగా బాగా నిద్రపట్టింది.

"ఒరే! అబ్బోడా! ఒక రేత్రికే యియ్యేరవదాకా నిద్రబోతే యింక బతుకులు తెల్లారినట్టే! లెయ్‌రా! లెయ్!" మా అయ్య అన్న మాటలతో ఎగిరి పడి లేచాను. లేచి చూస్తే అప్పటికే నాలుగు బార్ల పొద్దెక్కింది.

గబగబ నాలుగు ముంతల నీళ్ళతో ఒళ్ళు కడుక్కొన్నాను. గడ్డ పెరుగుతో అమ్మ పెట్టిన అంత సద్దిబువ్వ తిన్నాను. నేను వచ్చి అప్పటికే నాలుగయిదు రోజు లయినా కూత దూరంలో ఉన్న నా చిన్ననాటి మిత్రుణ్ణి చూడడానికి వలనుపడలేదు. అందుకే బయలుదేరాను.

మా వూరికీ ఆ వూరికీ మధ్య దూరం మూడు కిలోమీటర్లకు మించదు.

ఒకప్పుడు అది బండి బాట!

ఎగుడు దిగుళ్ళతో మిట్టా పల్లాలతో ముండ్ల పొదలతో నిండి ఉండేది. కాలుదీసి కాలు బెట్టడమంటే మహా యాతనగా ఉండేది. ఇప్పుడా ముళ్ళపొదలన్నీ కొట్టిపారేశారు. ఈ పక్క ఆ పక్క మట్టిని కొట్టిపోసి మిట్ట పల్లాలను చదును చేశారు. ప్రభుత్వం చేపడుతున్న గ్రామాభివృద్ధి కార్యక్రమాల ఫలితం కాబోలు! అని ఆలోచిస్తూ ఆ బాటమీద నడుస్తున్నాను.

"ఏం సిన్నబ్బా? .... ఎప్పు డొచ్చింది? .... అంతా బాగుండారా నాయినా!"

మాట చెవిని బడడంతో నిలబడి 'ఎవరా?' అని కలయజూశాను.

ఎదురుగా మాదిగ రాముడు.

నెత్తిమీద మట్టితట్ట ఉంది. వళ్ళంతా 'పుల్లదుమ్ము' నిండుకొంది. మొగంలో మునుపటి కళ వెతికినా కనిపించడం లేదు. బుగ్గలు సొట్ట బడ్డాయి. కండ్లు బాగా లోతుకుపోయి నిరాశా నిస్పృహలకు ఆశ్రయ మిస్తున్నాయి.

కాసేపు కన్నార్పకుండా ఆశ్చర్యంగా వాడివైపు చూస్తూ నిలబడి పోయాను. నా ఆశ్చర్యం రాముడికి అర్థమయినట్లుంది.

"ఏం జెయ్ మంటారు సెప్పండి సాఁవీ! .... ఈ కరంటు రానన్నా వచ్చింది. మోట కట్టే నాథుడే లేకపాయ!....మా బతుకు లిట్లా మట్టి పాలాయ. ఇంటిల్లిపాదీ సచ్చీ సెడి సంచేళదాక ఈ మట్లో పోరకలాడితే పొట్ట కంత గెంజి దొరికేది గెగనవై పోతా వుండాది. పోయ్న రోజు లింక రాబొయ్యేది లేదు నాయినా!"

రాముడి గొంతు పూడుకు పోయింది!

అప్పు డర్థమయింది నాకు - కరెంటు మోటార్ల మీద వాడి అక్కసు!!

కడపదాటి కాలట్లా పెట్టని రాముడి పెళ్ళాం లచ్చిఁవి పారతో మట్టిని తట్టల కెత్తుతూ ఉంది. పెండ్లికి ఎదిగిన ఒక కుర్రవాడు గడ్డపారతో మట్టిని పెళ్ళగిస్తున్నాడు. వాడికంటె ఒకటి రెండేళ్ళు చిన్నదిగా ఉండవచ్చు. ఇంకొక అమ్మాయి రాముడితో కలిసి మట్టి మోస్తూ ఉంది. బహుశా వాడి బిడ్డలేమో?

సముదాయింపుగా రాముడితో రెండు మాటలు పలకదామను కున్నాను.

"ఎవుడ్రా అక్కడ మీటింగి పెట్టింది?....మాదిగ రాఁవుడేనా? నాకు దెల్సు! వాడెప్పుడూ అంతే!" పనికి ఆహార పథకంలో ఆ మట్టి బాటను వేయిస్తున్న కాంట్రాక్టరు గోలపెడుతున్నాడు.

"గెంటల తరబడి యింటి ముందర నిలబెట్టి రైతుల్ని—అవ్వి ఆ రోజులు. ఇప్పుడు నిమిశం నిలబడితే ఆ అయ్య కసురుకుంటుంటాడు— ఇవి ఈ రోజులు. ఏంజేద్దాం బాబూ! వస్తా" అంటూ రాముడు తన పనిలో తాను లీనమయ్యాడు.

"ఎవురక్కడ మీటింగు పెట్టింది? మాదిగ రావుడేనా?" అన్న కాంట్రాక్టరు మాటలు సూటిగా నా గుండెల్లో దిగాయి. అడుగు మంద కొడిగా ముందుకు పడింది.

రాముడి వృత్తి మారింది.

అయినా వాడు యింకనూ మాదిగ రాఁవుడే!

ఒకప్పుడు వృత్తులకోసం కులాలు ఏర్పడ్డాయి. మారుతున్న సమాజంలో మీరిపోతున్న నాగరికతలో వృత్తులు అడుగంటి పోతున్నాయి. అయినా కులాలు మాత్రం నిలబడిపోయాయి.

ఆలోచిస్తూ వూరి ముందరికి వచ్చాను.

ఊరి వెల్లువ పారి సారవంత మయిన పొలాలు సస్యలక్ష్మి సయ్యాటతో కనుల పండువగా ఉన్నాయి. ఆ పొలాల మధ్య నిటారుగా నిల

బడి ఉన్నాయి సర్వే రాళ్ళు. ఈ సర్వే రాళ్ళనే 'నెంబర్రాళ్ళు' అంటారు. ఇది నా పొలం! అది నీ పొలం!!" అని హద్దులు నిర్ణయించేదీ నెంబ ర్రాళ్ళే!

ఈ నెంబర్రాళ్ళు పొలాలను వేరు చేస్తున్నాయి.

కులాలు మనుష్యులను వేరు చేస్తున్నాయి!!!

"ఈ నెంబర్రాళ్ళే లేకపోతే?" నా మనస్సులో పొడసూపిన సందేహా నికి సమాధానంగా యేమో నెంబర్రాళ్ళు విరగబడి నవ్వుతున్న ట్లున్నాయి!

— ఆంధ్ర ప్రభ (11-6-80)